క్లుప్తంగా

పాఠశాలకు నూతన వంట పాత్రలు



ఎమ్మార్సీ కార్యాలయంలో వంట పాత్రాలను పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటయ్య

తాండూరు రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని 250 పాఠశాలలకు నూతన వంట పాత్రాలను ప్రభుత్వం అందజేస్తోంది. సోమవారం తాండూరు ఎమ్మార్సీ కార్యాలయానికి వంట పాత్రాలు చేరాయి. వీటిని ఎంఈఓ వెంకటయ్య పరిశీలించారు. పాఠశాలలను తిరిగి ప్రారంభించేలోపు అన్నిపాఠశాలలకు పంపిస్తామని ఆయన పేర్కొన్నారు. ఒక్కో వంట పాత్రా 30కిలోలు, 20, 10, 5కిలోల వరకు ఉన్నాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని పాఠశాలలకు కొత్త పాత్రాలు పంపిణీ చేస్తోందన్నారు. త్వరలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వంట సిబ్బందికి పంపిణీ చేస్తారని ఎంఈఓ పేర్కొన్నారు.

అంత్యోదయ కార్డులు ఇవ్వాలి

రాష్ట్ర దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు రాజేశ్



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రాజేశ్ తదితరులు

దోమ: రాష్ట్రంలో అర్హులైన దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలని రాష్ట్ర దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు గిద్దె రాజేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం దోమ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులను విస్మరించి పాలన సాగిస్తుందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుధీర్, మండల అధ్యక్షుడు చుక్కయ్య, నేతలు మహేశ్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు వానాకాలం పంటలపై అవగాహన

కొడంగల్ రూరల్: మండల పరిధిలో రుద్రారం గ్రామంలోని రైతువేదికలో బుధవారం ఉదయం 9గంటల నుంచి శాస్త్రవేత్తల సమక్షంలో వానాకాలం పంటలపై రైతులకు అవగాహన నిర్వహించనున్నట్లు తులసి తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో రైతులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని తెలిపారు. పంటల సాగు, సస్యరక్షణ చర్యలు, మందుల వాడకం తదితర అంశాలపై మాట్లాడుతారని, రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ సేవలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ సేవల్లో భాగంగా 4సిప్టును మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రప్రియ తెలిపారు. ఆస్పత్రిలో 3సిఫ్టుల్లో డయాలసిస్ సేవలు కొనసాగేవని, రోగుల సౌకర్యార్థం 4వ సిఫ్టును ప్రారంభించనున్నట్లు ఆమె తెలిపారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి



పూజలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

పూడూరు: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావం అలవార్చుకోవాలని ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాకంచెర్ల గ్రామంలోని శ్రీ యోగానంద లక్ష్మీనరసింహా స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక నాయకులతో కలిసి దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఆర్థికసాయం అందజేత

కేశంపేట: మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఎరుకలి ముత్తమ్మ మంగళవారం మృతి చెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, గుండ్రాతి రమణయ్యగౌడ్ రూ.5వేల చొప్పున మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన కడియాల వెంకటయ్య మృతి చెందడంతో అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేల చొప్పున కుటుంబ సభ్యులకు అందించారు.

పంచాయతీలో నిధులు కరువు!

- గాడితప్పుతున్న పాలన
- అభివృద్ధికి నోచుకోని గ్రామాలు
- ఎనిమిది నెలలుగా సొంత ఖర్చులతోనే పనులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్యదర్శులు
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు



గొడుగోనిపల్లి పంచాయతీ కార్యాలయం

దోమ: గ్రామ పంచాయతీల్లో పాలన గాడి తప్పుతోంది. సర్పంచుల పదవి కాలం ముగిసినప్పటి నుంచి పల్లె పాలనకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంచాయతీ ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో నిత్యం అభివృద్ధి పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో ఆ భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతోంది. ఈ విషయాన్ని ప్రత్యేకాధికారులు పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ పాలన తలనొప్పిగా మారింది.

కార్యదర్శులపై భారం

గతేడాది ఫిబ్రవరి 2వ తేదీ వరకు సర్పంచులు, పాలకవర్గాలకు పంచాయతీ బాధ్యత ఉండేది. గ్రామంలో ఏ పని చేపట్టాలన్నా వారే ముందుగా ఖర్చు చేసి తర్వాత బిల్లులు డ్రా చేసుకునేవారు. కానీ వారి పదవి కాలం ముగిసి పదిహేను నెలలు



మరమ్మతు పనులు చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి మీన

గడుస్తున్నా ఆ భారమంతా పంచాయతీ కార్యదర్శులపైనే పడుతూ వస్తుంది. దోమ మండలంలో మొత్తం 36 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు, ట్రాక్టర్ నిర్వహణ, నర్సరీ, డీజిల్ ఖర్చులు, నీటి ట్యాంకుల శుభ్రత, సింగిల్ ఫేజ్ మోటార్లు అమర్చడం, మిషన్ భగీరథ కనెక్షన్లు, రిపేర్ల వంటి పనులకు కార్యదర్శులే సొంతంగా డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

సకాలంలో నిధులు రాక ఇబ్బందులు

పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నుంచి నిధులు విడుదల అవుతాయి. దీంతో జనాభా నిష్పత్తి ప్రకారం ఆయా గ్రామాలకు విడుదల చేస్తారు. అక్టోబర్ నుంచి నేటి వరకు 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు విడుదల కాకపోవడంతో పంచాయతీల పాలన కార్యదర్శులకు తలనొప్పిగా మారింది. ఒక్కో పంచాయతీ కార్యదర్శికి రూ. 2లక్షలకుపైగా అప్పులు తెచ్చి పంచాయతీ పాలనను కొనసాగిస్తున్నారు. కానీ వాటి బిల్లులు రాక ఎలా తీర్చాలోనని పంచాయతీ కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. వడ్డీలు పెరిగి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు.

“ అప్పులు తెచ్చి పనులు చేయించా



గ్రామ పంచాయతీలో నిధులు లేకపోవడంతో అప్పులు తెచ్చి పాలనను ముందుకు తీసుకువెళ్తున్నా. సుమారు ఇప్పటివరకు రూ. లక్షన్నర వరకు అప్పులు తెచ్చి పంచాయతీలో ఖర్చు చేశా. పారిశుద్ధ్య పనులు, వీధిదీపాల నిర్వహణ, ట్రాక్టర్ నిర్వహణ, డీజిల్ ఖర్చులు, నీటి ట్యాంకుల శుభ్రత, సింగిల్ ఫేస్ మోటార్లు అమర్చడం వంటి పనులు చేశాను. కానీ నేటికి వాటి బిల్లులు రాలేదు. ఎనిమిది నెలలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– లలిత, పంచాయతీ కార్యదర్శి, గొడుగోనిపల్లి

నిర్వహణ భారంగా..



గ్రామ పంచాయతీ పనుల నిర్వహణ భారంగా మారుతుంది. గ్రామంలో చేపట్టాల్సిన పనులు డబ్బులు లేక నానా అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పటివరకు గత ఎనిమిది నెలలుగా గ్రామంలో చేపట్టిన పనులకు రెండున్నర లక్షల వరకు ఖర్చు చేశా. ఇప్పటివరకు 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రాలే. దీంతో పాలన భారంగా మారింది.

– రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, మోత్కూర్

ఉన్నతాధికారుల దృష్టికి..



గ్రామాల్లో చేపడుతున్న పనులకు పంచాయతీ కార్యదర్శులే సొంత ఖర్చు లతో చేపడుతున్న విషయం తమ దృష్టికి వచ్చింది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. బిల్లులు వచ్చేలా కృషి చేస్తామని వారు చెప్పారు. పంచాయతీ పాలనలో ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– గ్యామా, ఎంపీడీఓ, దోమ

మురుగు.. పరుగు!

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు



నాగసమందర్‌లో రోడ్డుపై చేరిన మురుగు

ధారూరు: గ్రామాల్లో ఏదైనా సమస్యలు వస్తే చెప్పుకుందామంటే సర్పంచ్ లేరు.. గ్రామ కార్యదర్శికి చెబితే పట్టించుకోరూ. తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితి నాగసమందర్ గ్రామస్తులది. ధారూరు మండలంలోని నాగసమందర్ గ్రామస్తులు మంగళవారం తమ గోడును వెళ్లబోసుకున్నారు. తమ గ్రామంలో రోజు రోజుకు సమస్యలు పెరుగుతున్నాయని, ఈ విషయం గురించి ఏ అధికారికి చెప్పినా గ్రామానికి వచ్చి పరిష్కరించరు. గ్రామంలో ప్రధాన రోడ్డుపై మురుగనీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజు ఈ దారి నుంచే ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు పల్లంలో ఉండడం వల్ల మురుగు సమస్య తీవ్రంగానే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. నాగసమందర్ గ్రామం నుంచి అల్లాపూర్ గ్రామానికి వెళ్లే రహదారిలోనే ఈ మురుగునీరు చేరుతుందని చెబుతున్నారు. సమీప ఇళ్లవారికి ఈ మురుగు వల్ల దుర్వాసన వెదజల్లడమే కాకుండా, దోమలు, ఈగలతో రోగాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. రాత్రిళ్లు దోమలు కుడుతున్నాయని దీంతో తాము నిద్రకు దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మురుగును శుభ్రంచేయించాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో కోత్లాపూర్ జాతర

తాండూరు రూరల్: మండల పరిధిలో కోత్లాపూర్ గ్రామ శివారులోని రేణుక ఎల్లమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. నెల రోజుల పాటు నిర్వహించనున్న ఈ జాతరకు తెలంగాణలోని వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని నిర్వాహకులు తెలిపారు. ప్రతీ మంగళ, శుక్రవారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తారు. ఆ తర్వాత అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఈ ఆలయ పరిసర ప్రాంతాలు కిటకిటలాడుతాయి. ఈ నెల 30న రథోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



రేణుక ఎల్లమ్మ జాతరలో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పరిగి: మండల పరిధిలో మిట్టకోడూర్‌లోని ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2006–07 పదోతరగతి చదివిన విద్యార్థులు తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులతో కలిసి ఆత్మీయ సమ్మేళనాన్ని పాఠశాలలో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకున్నారు. 18 సంవత్సరాల తరువాత ఒకే దగ్గరకు చేరి ఒకరినొకరు పలకరించుకొని కుటుంబ యోగక్షేమ సమాచారం తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, మాణిక్యం, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇళ్లు



లబ్ధిదారుల నివాస ప్రాంతాలకు వెళ్లి సర్వే చేస్తున్న ఎంపీడీఓ సోమలింగం తదితరులు

కుల్కచర్ల: నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని చౌడాపూర్ ఎంపీడీఓ సోమలింగం పేర్కొన్నారు. మంగళవారం చౌడాపూర్ మండలం పుర్సంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నివాసప్రాంతాలకు వెళ్లి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలననుసరించి ఇళ్లను నిర్మించుకోవాలన్నారు. ప్రస్తుతం మొదటి విడత లబ్ధిదారుల ఇళ్ల పరిశీలన పూర్తయ్యిందన్నారు. లబ్ధిదారులు వెంటనే పనులు పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ రాజిరెడ్డి, నాయకులు క్రిష్టారెడ్డి, ఎర్రం శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బీఎంఆర్ క్రికెట్ టోర్నమెంట్

తాండూరు రూరల్: మండల పరిధిలోని చెంగోల్ గ్రామంలో గురువారం నుంచి బుయ్యని మనోహర్‌రెడ్డి విలేజ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామ యువ నాయకుడు రాముయాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్టు ఎంట్రీ ఫీజు రూ.1,500 చెల్లించి పేర్లను నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.30వేలు, రెండోవ బహుమతి రూ.15వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అంపైర్ నిర్ణయమే తుది నిర్ణయమని తెలిపారు. ఇతర వివరాలకు 9885954394, 9849487732 నంబర్లపై సంప్రదించాలని సూచించారు.

మొగిలిగిద్ద కళాశాలకు అటెండర్ నియామకం

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అధికారులు అటెండర్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు శ్యాంసుందర్ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు సీఎం రేవంత్‌రెడ్డి, కళాశాల విద్యా కమిషన్, కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. జనవరిలో మొగిలిగిద్ద పర్యటనకు విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి కళాశాల సమస్యలను తీసుకెళ్లారు. దీంతో కళాశాలకు రెగ్యులర్ అటెండర్‌ను కేటాయించడంపై గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి

తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి

తాండూరు: ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సహకారంతో సాయిపూర్ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తాండూరు మున్సిపల్ పరిధిలోని సాయిపూర్ ప్రాంతానికి చెందిన 9వ వార్డులో రూ.8లక్షల డీఎఫ్ఎఫ్‌టీ నిధులతో సీసీ రోడ్డు పనులను మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నీరజాబాల్‌రెడ్డి, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాండూరు మున్సిపల్ అభివృద్ధికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపిస్తున్నారన్నారు. గతంలో ఎమ్మెల్యేలుగా ఉన్న వారంతా హామీలకే పరిమితం అయ్యారన్నారు. అయితే ఎమ్మెల్యే ఇచ్చిన ప్రతి హామీని విడతల వారీగా పనులు చేయిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బంటు వేణుగోపాల్, బంటు మలప్ప, తంద్రా రాకేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న పట్లోళ్ల బాల్‌రెడ్డి తదితరులు

కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలి



రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సంఘాల వినతి

బొంరాస్‌పేట: రోడ్డు కాంట్రాక్టర్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని బాపన్ చెరువు తండా రోడ్డు నిర్మాణ పనుల్లో పట్టా భూమి కోల్పోతున్న దళిత రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పనులు చేపట్టారు. ఈ విషయంలో తమను సంప్రదించకుండా దౌర్జన్యంగా రోడ్డు పనులు చేయిస్తున్నారని రైతులు వాపోయారు. వెంటనే సంబంధిత రోడ్డు కాంట్రాక్టర్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసి, లైసెన్స్ రద్దు చేయాలని ప్రజా సంఘాల నాయకులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రేగడిమైలారం గ్రామానికి చెందిన కడంపల్లి బాలయ్య సర్వే నంబర్ 197/ఆ, (0.20గుంటలు)భూమి కోల్పోతున్నాడని పేర్కొన్నారు. బాధిత రైతుపై పలువురు తండావాసులు దాడి చేసినా, పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం విచాకరమన్నారు. వెంటనే బాధిత రైతుకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, ఆయా ప్రజా సంఘాల నాయకులు కొత్తురు చంద్రయ్య, వెంకటయ్య, దస్తప్ప, అంజిరావణ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

గిరిజన గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాస్

కొడంగల్ రూరల్: మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ శివారులోని గిరిజన గురుకుల విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గిరిజన గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పేర్కొన్నారు. 2025–26ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన బాలుర విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 15వ తేదీన హయత్‌నగర్‌లోని పీవీటీజీ బాలుర కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు తమ వెంట 10వ తరగతి ఉత్తీర్ణత మార్కుల సర్టిఫికెట్, బదిలీ సర్టిఫికెట్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, స్పోర్ట్స్‌తోపాటు 3కలర్ ఫొటోలు, రెండు సెట్ల జిరాక్స్‌లతో హాజరుకావాలని పేర్కొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండలంలోని విశ్వనాథ్‌పూర్, వెంకిర్యాల గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా కొందుర్గును పైలెట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో ఎంతో మంది రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని, వారి ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. భూ సమస్యలు లేని రాష్ట్రాన్ని నిర్మించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రతీ రైతుకు ప్రభుత్వం త్వరలో భూ ఆధార్ కార్డును అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్‌కుమార్, నాయకులు కృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్, లింగం, మాసయ్య, రామకృష్ణ, కరుణాకర్ రెడ్డి, యాదయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు



రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రెవెన్యూ అధికారులు

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపాలిటీలోని వీరభద్ర కాలనీలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు రోడ్డు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కాలనీలోని యాక్సిస్ బ్యాంక్ నుంచి మైసమ్మ ఆలయం వరకు సీసీరోడ్డుకు కావాల్సిన నిధులను మంజూరు చేయిస్తానన్నారు. దీనికి సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు ఆదేశిస్తానని కాలనీ ప్రజలకు చెప్పారు. అడిగిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాలె యాదయ్యకు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

విడతల వారీగా వార్డులను అభివృద్ధి చేస్తాం

కొత్తూరు: మున్సిపాలిటీలో ఉన్న అన్ని వార్డుల్లో విడతల వారీగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం 1వ వార్డులో మున్సిపల్ నిధులు రూ.5లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులు ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇప్పటికే అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసినట్లు వివరించారు. నిధుల లభ్యతను బట్టి వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. వైస్ చైర్మన్ దోలి రవీందర్, కౌన్సిలర్లు మాదారం నర్సింలుగౌడ్, మాధవి, కోస్గి శ్రీనివాస్, నాయకులు దేవేందర్‌యాదవ్, గోపాల్‌గౌడ్, శ్రీను, యాదయ్య, జనార్ధన్‌చారి పాల్గొన్నారు.